క్లుప్తంగా

విజయానికి ప్రతీక దీపావళి


కోటగిరి శ్రీధర్, ఏలూరు ఎంపీ


కొఠారు అబ్బయ్యచౌదరి, దెందులూరు ఎమ్మెల్యే

దెందులూరు: చెడుపై మంచి విజయాన్ని సాధించే ప్రతీకే దీపావళి అని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ప్రతీ ఇంట్లోనూ దీపావళి ఆనందాల వెలుగులు వెల్లువిరియాలనీ, రంగుల కాంతులతో ఈ ఏడాది అంతా నూతన సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఏలూరు జిల్లాలోని ప్రజలకు, అధికారులకు, వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలు, అభిమానులకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

సంతోషంగా జరుపుకోవాలి

వెలుగుల దీపావళిని ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని మనసారా కోరుకుంటున్నట్లు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. దీపావళితో ప్రజల జీవితాల్లోనూ నిజమైన వెలుగులు విరజిమ్మాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలు విడుదల

పెదపాడు: స్థానిక శాఖ గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి నిర్వహిస్తున్నామని పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం వాల్‌పోస్టర్లు కరపత్రాలను స్థానిక గ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ వారోత్సవాల్లో పాఠకులు, విద్యార్థులు, కవులు, కళాకారులు పాల్గొనాలని కోరారు. ఈకార్యక్రమంలో గ్రంథపాలకుడు దుగ్గిపోగు జాన్‌బాబు, ఆరవల్లి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

దెందులూరులో..

దెందులూరు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 వరకూ దెందులూరు, పోతునూరు గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్నామని గ్రంథాలయాధికారులు ఝాన్సీ, రాంబాబు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు, గ్రామస్తులు గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్నాలని వారు సూచించారు.

ఆజాద్ సేవలు చిరస్మరణీయం


భీమడోలులో గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

భీమడోలు: విద్యా వ్యవస్థకు ఆద్యుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని భీమడోలు జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో శనివారం భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 136వ జయంతిని సందర్భంగా పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పాము మాన్‌సింగ్, అభివృద్ధి కమిటి గౌరవ అధ్యక్షుడు రామకుర్తి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు మద్దాల అప్పారావులతో కలిసి జెడ్పీటీసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేసి మౌలానా సేవలు మరవలేనివన్నారు. మౌలానా జీవితాన్ని స్ఫూర్తిని పొంది యువత తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దేశంలో మునుపెన్నడూ లేని విధంగా విద్యా సంస్కరణలను అమలు చేస్తూ ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లోను మౌలానా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు కె.శ్రీనివాస్, డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, యువకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దీపావళికి ప్రమిదలు సిద్ధం

దెందులూరు: దీపావళి పర్వదినానికి మార్కెట్ సిద్ధమైంది. వివిధ రకాల ప్రమిదలు, ముంతలు మార్కెట్‌లో సందడి చేస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనిల విధంగా వివిధ రకాల డిజైన్లతో ప్రమిదలు, కుండలు మార్కెట్‌లో ముస్తాబై అమ్మకానికి సిద్ధం ఉన్నాయి. మరో వైపు దీపావళి సామగ్రి సైతం మార్కెట్‌లో అమ్మకానికి రెడీగా ఉన్నాయి.

జెండా స్థూపం నిర్మాణ పనుల పరిశీలన

దెందులూరు: మండలంలోని కొత్తగూడెం వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్ ఆర్థిక సహాయం రూ.36 వేలతో శనివారం వైఎస్సార్ సీపీ జెండా స్థూపం నిర్మించారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షులు కామిరెడ్డి నాని, సర్పంచ్ పరసా లక్ష్మి సుజాత కనకరాజు, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), ఎంపీటీసీ సభ్యురాలు పులవర్తి వరమణి, పార్టీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబులు శనివారం జెండా స్థూపాన్ని పరిశీలించి దాత సురేష్‌ను అభినందించారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి

- డివిజన్ వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం
- పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు


గణపవరం: మహిళలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు


పెదపాడు: సత్యవోలు గ్రామంలో మాట్లాడుతున్న దెందులూరు ఎమ్మెల్యే కొఠారు

గణపవరం: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకూ మేలు చేకూరాలంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి తెచ్చుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు.ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఉంగటూరు మండలంలో ఉద్యమంలా సాగుతోంది. శనివారం రాత్రి గణపవరం మండలం అర్ధవరం గ్రామంలో రాష్ట్రానికి మళ్లీ జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ ఐదేళ్ల జగన్ పాలనలో రైతులు, మహిళలు, విద్యార్థులు, కార్మికులు పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు చేశారన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే రాష్ట్రానికి మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్‌జగన్ రావాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతి గ్రామంలోనూ మాజీవితాలలో వెలుగులు నింపిన జగనే మళ్లీ సిఎంగా రావాలని ప్రజలంతా ముక్తంకంఠంతో కోరుతున్నారన్నారు. ఈసందర్భంగా ఆయన గ్రామంలో ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకూ అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు గురించి వివరించారు. ఆయా కుటుంబాలకు నాలుగున్నరేళ్లలో అందిన పథకాల లబ్ధిని వివరించి, మీరంతా జగన్‌కు అండగా ఉండాలని కోరారు. రాష్ట్ర చరిత్రలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కనీవినీ ఎరుగని రీతిలో అమలు చేసి సరికొత్త రికార్డు సృష్టించిన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే మరిన్ని సరికొత్త పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతారన్నారు. ఎన్నికల హామీలను నూరుశాతం అమలు చేయడమే కాక, ఇవ్వని హామీలనుసైతం నెరవేర్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యరంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రతి కుటుంబానికి లక్షల విలువైన విద్య, వైద్యాలను ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం గ్రామానికి మంజూరైన వివరాలను తెలిపే ఫ్లెక్సీని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటిసి సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దండు రాము, సర్పంచ్ గాతల సుజాత, ఎంపీటీసీ సుభాష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సత్యవోలులో...

పెదపాడు: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడం ద్వారా పేదల అభివృద్ధికి పాటు పడుతున్నందుకు మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించాలని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తెలిపారు. సత్యవోలు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. అలాగే రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనం నుంచి పంటలు కొనుగోలు చేసే వరకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ పాలనకు ప్రస్తుత ప్రభుత్వ పాలనకు తేడా గమనించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, దెందులూరు జెడ్పీటీసీ సభ్యురాలు నిట్టా నవలీలాకాంతం, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు, నరసాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపి, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్, సర్పంచ్ రంభ ఉమామహేశ్వరి, వైస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి, గారపాటి బాస్కరరావు, ఎంపీటీసీ సభ్యులు మారుమూడి కృపామణి, కర్రె మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

'గడపగడపకు' సమస్యలు పరిష్కరిస్తాం


సీసీ డ్రెయిన్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని, ఇప్పటికే పనులు వేగవంతంగా సాగుతున్నాయని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శనివారం ఆయన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణాలు నాణ్యతగా, పటిష్టంగా ఉండాలన్నారు. ప్రతి గ్రామ సచివాలయానికి ప్రజల సమస్యల పరిష్కారానికి రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసిందని, ఆనిధులతో అత్యవసర సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా సీసీ డ్రెయిన్స్, రోడ్లు, తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలను యుద్ధ ప్రాతిపదికపై పరిష్కరించనున్నట్లు తెలిపారు. పింఛన్‌లు, ఇళ్లస్థలాలు, రేషన్ కార్డులు, పక్కా గృహాలు వంటి సమస్యలను ప్రభుత్వానికి నివేదించామని, త్వరలోనే వాటిని కూడా పరిష్కరిస్తామని వాసుబాబు తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కిలారి సత్యవతి రవిబాబు, ఉప సర్పంచ్ వెల్లంకి నరేష్, నాయకులు పాల్గొన్నారు.

సర్వోదయ విధానాలు అలవర్చుకోవాలి


గాంధీ, మూర్తి రాజు విగ్రహాలకు నివాళులర్పిస్తున్న జిల్లా సర్వోదయ మండలి సభ్యులు


మూర్తిరాజు విగ్రహానికి పూల మాలవేసి నివాళ్లర్పిస్తున్న లయన్స్ సభ్యులు

నిడమర్రు: సర్వోదయ విధానాలైన శాంతి, అహింసలను నేటి యువత అలవర్చుకోవాలని జిల్లా సర్వోదయ మండలి అధ్యక్షురాలు మృదుల కుమారి అన్నారు. శనివారం మాజీ మంత్రి సర్వోదయ నాయకులు చింతలపాటి మూర్తిరాజు 11వ వర్ధంతి పురస్కరించుకుని పెదనింద్రకొలను మహాత్మా గాంధీ భవనంలో ×సర్వోదయ యువ వాహిని$\bar{}$ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని భీమవరం ఎస్‌ఆర్కే ఇంజనీరు కళాశాల హెచ్‌ఓడీ ప్రసాద్ ప్రారంభించారు. ముందుగా మహాత్మా గాంధీ, మూర్తిరాజు విగ్రహాలకు సభ్యులు పూలమాలలతో ఘన నివాళులర్పించి మూర్తి రాజు సేవలు కొనియాడారు. ఈ సందర్భంగా గాంధీ భవనం అభివృద్ధి నిమిత్తం వసుధ పౌండేషన్, తపన పౌండేషన్ సభ్యులు రూ1.5లక్షల చెక్కులను అధ్యక్షురాలు మృదల కుమారికి అందించారు. ఈ కార్యక్రమంలో సర్వోదయ మండలి అధ్యక్షుడు, రిటైర్డ్ డీఈవో ఇందుకూరి ప్రసాదరాజు, సాగిరాజు జానకిరామరాజు, ఆర్‌వీఎస్ రాజు, లక్ష్మీపతిరాజు, మంత్రబుద్ధి అప్పారావు, ఎస్‌ఆర్కే ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మూర్తి రాజు సేవలు మరువలేనివి

ఉంగుటూరు: మూర్తి రాజు సేవలు మరువలేనివని లయన్స్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. శనివారం మూర్తిరాజు వర్ధంతిని జిల్లా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నారాయణపురం సెంటర్లో ఉన్న మూర్తిరాజు విగ్రహం వద్ద నిర్వహించారు. లయన్స్ జిల్లా గవర్నర్ మాట్లాడుతూ జిల్లాలో విద్యా సంస్థలను నెలకొల్పిన మహనీయుడు మూర్తి రాజు అని తెలిపారు. గజిల్‌శ్రీనివాస్ మాట్లాడుతూ మూర్తిరాజు పూర్వ కాలమే విద్యకు గల ప్రాముఖ్యతను చాటి చెప్పారని అన్నారు. బిజేపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాలమాలతీరాణి మాట్లాడుతూ విద్యతో నే సమాజంలో మార్పు వస్తాదని గ్రహించి జిల్లాలో విద్యావ్యాప్తికి విద్యసంస్థలను నెలకొల్పిన మహనీయుడు మూర్తిరాజు అని కొనియాడారు. తొలుత మూర్తిరాజు విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పిల్లలకు బుక్సు స్టేషనరీ, కిట్లు పంపిణీ చేశారు. చేతితో తయార చేసిన ప్రమిదలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ అడపాశోభారాణి, జోన్ చైర్మన్ పేరి చర్ల మురళీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యం


పెదవేగి సీతమ్మ చెరువును ఉన్నతాధికారుల బృందంతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదవేగి: ప్రజల దాహార్తి సమస్యను తీర్చడమే లక్ష్యంగా ఎంతో శ్రమించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో దశాబ్దాల సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తున్నామని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. మండలంలోని 35 ఎకరాల సీతమ్మ చెరువు ప్రాంతాన్ని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల దాహార్తిని తీర్చడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారని తెలిపారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా, పెదవేగి మండలాన్ని రెడ్ జోన్ గా ప్రకటించారని, బోర్లు కూడా వేసే అవకాశం లేని కారణంగా ఇక్కడి 42 గ్రామాలోని ప్రజలకు తాగు నీటికి నివారించేందుకు తాను మంత్రులు, సంబంధిత అధికారులు, నిపుణులతో మాట్లాడి ఒక బృహత్ ప్రణాళికను రూపొందించామని ఆయన చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దృష్టికి, ఇక్కడి నీటి ఎద్దడి సమస్యను వివరించగా, ఆయన రూ.61 కోట్ల నిధులు కేటాయించి దెందులూరుకు అండగా నిలిచినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా, గోదావరి కాలువ నుంచి ఎత్తిపోతల ద్వారా పైపు లైన్ల గుండా పెదవేగిలోని సీతమ్మ చెరువులోకి నీటిని తరలిస్తామని, అనంతరం సీతమ్మ చెరువును రక్షిత చెరువుగా మార్చి, అత్యాధునిక ఫిల్టరింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసి పరిశుభ్రమైన నీటిని ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా సూర్యారావుపేట, న్యాయంపల్లి కేంద్రాల ద్వారా అన్ని ప్రాంతాలకు నీరు చేరుస్తామని, తద్వారా, 50,000 మంది ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, పెదవేగి ఎంపీపీ తాతా రమ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ పెదవేగి మండల అధ్యక్షుడు జానంపేట బాబు, తహసీల్దార్ ఎన్ నాగరాజు, పెదవేగి సొసైటీ అధ్యక్షుడు పెనుమాక వెంకట సుబ్బారావు, సీనియర్ నాయకులు తాతా సత్యనారాయణ, మేడికొండ కృష్ణారావు, తూముల రాజు పాల్గొన్నారు. గ్రామ సచివాలయం రైతుబరోసా కేంద్రాలు ప్రారంభం పోటో

సచివాలయం, రైతుభరోసా కేంద్రాల ప్రారంభం

పెదపాడు: గ్రామాభివృద్ధికి గ్రామ సచివాలయాలు తార్కాణాలని వాటి ద్వారా సంక్షేమపథకాలు అమలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. పెదపాడు మండలంలోని సత్యవోలు గ్రామంలో ఘంటా ఎరుకునాయడు పార్వతమ్మ జ్ఞాపకార్థం వారికుమారుడు రంగారావు, అచ్చిమాంబ వారి కుమారులు అందించిన స్థలంలో రూ.43లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.23 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు అన్ని రకాల సేవలు గ్రామాల్లోనే అందించాలనే సంకల్పంతో సచివాలయ వ్యవస్థను రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, దెందులూరు జెడ్పీటీసీ సభ్యురాలు నిట్టా లీలా నవకాంతం, సర్పంచ్ రంభ ఉమామహేశ్వరి, వైస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు, నరసాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు పాల్గొన్నారు.

నిబంధనలను ఉల్లంఘిస్తే లైసెన్స్‌లను రద్దు చేస్తాం


భీమడోలులో బాణా సంచా దుకాణాలను తనిఖీ చేస్తున్న సీఐ బీబీ రవికుమార్, ఎస్సై చావా సురేష్‌కుమార్‌లు

భీమడోలు: బాణా సంచా విక్రయ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని లేని పక్షంలో లైసెన్సులు రద్దు చేస్తామని భీమడోలు సీఐ బీబీ రవికుమార్ అన్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక, శాశ్వత దుకాణాలను శనివారం సాయంత్రం ఎస్సై చావా సురేష్‌కుమార్‌తో కలిసి వారు తనిఖీలు చేశారు. బాణా సంచా దుకాణదారులకు పలు సూచనలు చేశారు. బాణాసంచా విక్రయ దుకాణాల వల్ల సూచికా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అగ్ని మాపక నియమ నిబంధలను పాటించాలని లేని పక్షంలో కఠిన తీసుకుంటామన్నారు. దుకాణాల మధ్య 3 మీటర్ల దూరంగా ఉండాలని, సిగరెట్లు తాగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేవలం మూడు రోజులకే పర్మిషన్

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని తాత్కాలిక బాణా సంచా విక్రయాల కేంద్రాలకు మూడు రోజులకు మాత్రమే పర్మిషన్ ఉంటుందని భీమడోలు అగ్నిమాపక శాఖాధికారి నాగరాజు శనివారం రాత్రి తెలిపారు. భీమడోలు అగ్నిమాపక శాఖ పరిధిలో భీమడోలు 9, ద్వారకా తిరుమల 10, ఉంగుటూరు 8, నిడమర్రు 8 బాణా సంచా దుకాణాలకు తాత్కాలిక అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. వారికి శుక్రవారం నుంచి బాణా సంచా సామాగ్రిని అమ్మకాలు ప్రారంభించారని, ఆదివారం రాత్రితో గడువు ముగుస్తుందన్నారు. అదే విధంగా గుండుగొలనులో రెండు శాశ్వత బాణా సంచా విక్రయాల దుకాణాలున్నాయని, నిడమర్రులో బాణా సంచా తయారీ కేంద్రం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. నియమ నిబంధనలపై నిర్వాహకులకు అవగాహన కల్పించామన్నారు. వాటిని అతిక్రమిస్తే వారి లైసెన్స్‌లను రద్దు చేయడంతో పాటు భవిష్యత్తులో వారిని బ్లాక్ లిస్ట్ ఉంచుతామన్నారు. నిడమర్రులో దుకాణాన్ని పరిశీలించడం జరిగిందన్నారు.

బాణసంచా వ్యాపారులు నిబంధనలు పాటించాలి

గణపవరం: బాణసంచా వ్యాపారులు అన్ని నియమ నిబంధనలు పాటించాలని ఆర్డీవో శ్రీనివాసుల రాజు అన్నారు. శనివారం ఆయన గణపవరం మండలంలోని గణపవరం, పిప్పరలో బాణసంచా దుకాణాలను తనిఖీ చేశారు. వ్యాపారుల లైసెన్సులను పరిశీలించారు. దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన రక్షణ చర్యలను పరిశీలించి, అధికారులకు సూచనలు ఇచ్చారు. నిబంధనలు పాటించకపోయినా, అనుమతి లేకుండా బాణసంచా విక్రయాలు జరిపినా కఠినచర్యలు తీసుకుంటామని, అవసరమైతే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ పమ్మి లక్ష్మి, డిటి. ఆర్‌ఐ, విఆర్‌వోలు ఉన్నారు.

నిబంధనలు పాటించాలి

దెందులూరు: దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా షాపుల నిర్వహించే యజమానులు నిబంధనలు పాటించాలని, షాపుల పక్కనే నీటిని నిల్వ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని పెదవేగి సీఐ కొండవీటి శ్రీనివాస్ అన్నారు. శనివారం సీఐ కార్యాలయంలో మాట్లాడుతూ టపాసులు కాల్చే సమయంలో తల్లిదండ్రులు పిల్లల పక్కనే ఉండాలని, అనుమతులు లేకుండా బాణసంచా అమ్మే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వీఆర్‌ఏ సంఘం మండల అధ్యక్షుడు తేరా రాజు మృతి

భీమడోలు: భీమడోలు మండల వీఆర్‌ఏ సంఘం అధ్యక్షుడు తేరా రాజు(48) శనివారం ఉదయం మృతి చెందారు. చెట్టున్నపాడు గ్రామానికి చెందిన రాజు పోలసానిపల్లి వీఆర్‌ఏగా విధులను నిర్వహిస్తున్నాడు.

పథకాలతో పేదల జీవితాల్లో మార్పు

శ్రీపర్రులో ఎమ్మెల్యే కొఠారు పర్యటన


శ్రీపర్రులో సంక్షేమ పథకాలను ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కొఠారు, ఎమ్మెల్సీ వెంకటరమణ, నాయకులు


వైఎస్సార్ సీపీ జెండా ఎగరేస్తున్న ఎమ్మెల్యే కొఠారు, ఎమ్మెల్సీ వెంకటరమణ

ఏలూరు రూరల్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో ఎంతో మార్పు తెచ్చిందని, అందువల్లనే ప్రజలు మళ్లీ మళ్లీ వైఎస్సార్ సీపీ పాలన రావాలని కోరుకుంటున్నారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శనివారం ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కమ్యునిటీహాలు వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. నాలుగున్నరేళ్ల పాలనలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాలు అమలు చేశారని వివరించారు. ఇంటింటికీ కుళాయి, సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ క్లినిక్ కేంద్రాలు ఏర్పాటు కావడంపై ప్రజలు ప్రభుత్వాన్ని మెచ్చుకుంటున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించాలని ప్రజలను కోరారు. తొలుత ఆయన ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులతో మాట్లాడారు. కూడలిలో పార్టీ జెండా ఎగరేశారు. సచివాలయం వద్ద సంక్షేమ పథకాల వివరాల ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సైదు భాగ్యలక్ష్మి, ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, పార్టీ గ్రామ నాయకుడు మండల సుభాని, జెడ్పీటీసీ మండల సరస్వతి, మండల కొండలరావు, పార్టీ మండలాధ్యక్షుడు తేరా ఆనంద్, జాలిపూడి సొసైటీ చైర్మన్ బొల్లిముంత రాము, మాదేపల్లి సర్పంచ్ కొరపాటి శ్రీరామ్ ప్రభుదేవ్, ఉపసర్పంచ్ నరహరిశెట్టి రాధాకృష్ణ, సైదు వజ్రం, కొక్కిరాయిలంక నాయకుడు అశోక్, ఎంపీడీఓ ప్రణవి, తహసీల్దార్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.